ప్రజాశక్తి
సోమవారం 28 నవంబర్ 2022




డిఎ, పిఎఫ్ బకాయిలపై 30న విజయవాడలో ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

డిఎ, పిఫ్, ఎపిజిఎల్ఐ, పెన్షనర్ల బకాయిల కోసం ఈనెల 30న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు తెలిపారు. ఈ సమస్యపై ఈనెల 22. ఉమ్మడి జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేసినప్పటికీ ఉపాధ్యాయుల, ఉద్యోగుల బకాయిలు చెల్లింపు జరగలేదని అన్నారు. కొద్దిమొత్తంలోనే బకాయిలు చెల్లించారన్నారు. ఇప్పటికే సుమారు రూ.1800 కోట్లు బకాయిలున్నాయని అన్నారు. వీటిని తీరని కోర్కెలు అంటున్నారని అన్నారు. కావున ఈ ధర్నాకు జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం ఈ ధర్నాను అణచివేయాలని చూస్తోందని, అయినా ఈ పోరాటం ఆగదని పేర్కొన్నారు.

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వేతో భూసమస్యలు పరిష్కారమవుతాయా? క్షేత్రస్థాయిలో ఉన్న వివాదాలు తొలగనున్నాయా? సర్వే చేపడుతున్న తీరు చూస్తుంటే స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులు తీరనున్నాయా? అంటే సందేహమే!. రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి నుంచి మండల స్థాయిలో ఎంపిపి వరకు, జిల్లా కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో సాధ్యం కాలేదని పలువురు వాపోతున్నారు. రీసర్వే వల్ల రైతులకు ఒరిగేదేమీ ఉండడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు పాలకొండ మండలమే నిదర్శనం.



డ్రోన్ సర్వే చేపడుతున్న సిబ్బంది

తేడాలను సరిచేయడం లేదు



రీసర్వేలో భూసమస్యలు ఉన్న దగ్గర తేడాలను సరిచేయడం లేదు. సర్వే చేసినప్పుడు మా గ్రామంలో 10, 20 సెంట్లు కొంతమంది రైతుల పేరిట నమోదు కాలేదు. దీంతో ఆందోళన చెందుతున్నాం. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఈ సర్వే వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేదు.

– పనస రాంబాబు, రైతు

రీ సర్వేతో.. భూ సమస్యలు తీరేనా?

- అవస్థలు పడుతున్న రైతులు
- సిబ్బందికి తప్పని తిప్పలు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో భూముల రీసర్వే విస్తృతంగా సాగుతోంది. పాలకొండ మండలంలో 32 పంచాయతీల పరిధిలో 45 గ్రామాలున్నాయి. ఇందులో 34 గ్రామాల్లో రీసర్వే మొదలైంది. 22 గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. మండలంలో 26,505 ఎకరాల భూమి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే పలు గ్రామాల్లో భూ వివాదాలున్నాయి. వాటిని చెక్‌పెట్టే పరిస్థితి భూముల రీసర్వేలో కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది.

వివాదాల భూములకు మోక్షం లేనట్టే

మండలంలో పలు గ్రామాల్లో ఉన్న వివాదాస్పదమైన భూములకు రీసర్వేలో చెక్‌పెట్టే పరిస్థితి కనిపించడం లేదు. భూయజమానుల మధ్య ఉన్న వివాదాలు నేటికీ కొనసాగుతున్నాయి. పొట్లి, అవలంగి, పణుకువలస, చినమంగళాపురం తదితర గ్రామాల్లో భూసమస్యలు ఎక్కువగానే ఉన్నాయి. వివాదాల్లో ఉన్న భూములను పెండింగ్‌లో పెడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో ఆ భూసమస్యలు పరిష్కారం కాకపోతే రీసర్వే ఎందుకని రైతుల నుంచి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మండలం నుంచి ఇతర ప్రాంతాలకు అనేక మంది వలసలు వెళ్లిపోయారు. వారికి గ్రామాల్లో కొంత భూమి ఉన్నప్పటికీ రీసర్వే జరుగుతున్నట్టు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో వారు కూడా హాజరుకాలేని పరిస్థితి నెలకొంది. కనీసం రెండు రోజుల ముందు గ్రామాల్లో దండోరా కూడా వేయించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.


సిబ్బందికి తప్పని ఇబ్బందులు

రీసర్వే లక్ష్యాలు పూర్తిచేయాలని ప్రభుత్వం క్షేత్రస్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో వారు తిప్పలు పడుతున్నారు. సర్వేయర్, రెవెన్యూశాఖలో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. అనేక మంది విఆర్‌ఒలు పనిభారం తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. కంప్యూటర్లు సరిపడినన్ని లేకపోవడంతో ప్రయివేట్ కంప్యూటర్ కేంద్రాలకు వెళ్లి సర్వే ప్రక్రియ నమోదు చేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. రాత్రి, పగలు తేడా లేకుండా కంప్యూటర్ల ముందుకు కూర్చుని కుస్తీలు పడుతున్నారు. కొంతమంది విఆర్‌ఒలు అనారోగ్యం పాలైనట్టు వాపోతున్నారు.

డ్రోన్ సర్వేతో మమా

మండలంలో అధికారులు డ్రోన్ కెమెరాలతో మాత్రమే 32 పంచాయతీల్లో సర్వే పూర్తి చేశారు. డ్రోన్ సర్వేతో మమా అనిపించి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయికి వెళ్లి ఏ సర్వే నంబర్‌లో ఎవరు సాగు చేస్తున్నారన్న వివరాలను గుర్తించడంలో విఫలమవుతున్నారని చెప్పొచ్చు. అనేక గ్రామాల్లో కొంతమందికి డి పట్టాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా ఇంతవరకు నమోదు చేయలేదని తెలుస్తోంది. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు



రీసర్వే వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉంది. అయితే రీసర్వే ద్వారా వచ్చిన పాస్‌పుస్తకాల్లో పూర్తిగా ముఖ్యమంత్రి ఫొటోతో ముద్రించారు. దీనివల్ల భవిష్యత్తులో వేరే ప్రభుత్వం ఏర్పాటైతే మా పాస్‌పుస్తకాలు పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. పాస్‌పుస్తకాల్లో రాజముద్ర వేసేవారు. ఇప్పుడు ఈ పరిస్థితి ఎదురవడంతో రైతుల్లో ఆందోళనగా ఉంది.

– ఖండాపు ప్రసాదరావు, రైతు

సర్వే సకాలంలో పూర్తిచేస్తాం



మండలంలో 32 పంచాయతీల్లో కూడా సర్వే సకాలంలో పూర్తిచేస్తాం. సిబ్బందితో ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో వచ్చిన డేటాను నమోదు చేయిస్తున్నాం. చిన్నచిన్న సమస్యలున్నాయి. వాటిని కూడా అధిగమిస్తాం. మొబైల్ కోర్టు డిటిలను కూడా ఈ సర్వేకు నియమించాం. ఎక్కడైనా తగాదాలుంటే వారి ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– పి.సోమేశ్వరరావు, తహశీల్దార్



ర్యాలీలో పాల్గొన్న సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు

గురజాడ అభ్యుదయ దార్శనికుడు

- ఆయన భావాలను ముందుకు తీసుకెళ్లిన వారికే పురస్కారం ఇవ్వాలి
- చాగంటికి ఇవ్వడం, ఆయన తీసుకోవడం అభ్యంతరకరం
- నిరసన ర్యాలీలో సాహితీవేత్తలు

ప్రజాశక్తి - విజయనగరం కోట

మహాకవి గురజాడ అప్పారావు అభ్యుదయ దార్శనికుడని, ఆయన భావాలను ముందుకు తీసుకెళ్లే వారికే గురజాడ విశిష్ట పురస్కారం ఇవ్వాలని సాహితీవేత్తలు, కవులు, కళాకారులు డిమాండ్‌చేశారు. ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన గురజాడ విశిష్ట పురస్కారం ప్రకటించడాన్ని నిరసిస్తూ సాహితీ స్రవంతి ఆధ్వర్యాన కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు ఆదివారం నగరంలో గురజాడ గౌరవ యాత్ర పేరిట ర్యాలీ చేట్టారు. మూడులాంతర్లు కూడలి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా గంటస్తంభం, ఎమ్మార్ కాలేజీ మీదుగా గురజాడ స్వగృహం వరకు ర్యాలీ సాగింది. 'దేశమును ప్రేమించుమన్నా... మంచి అన్నది పెంచుమన్నా... వట్టి మాటలు కట్టిపెట్టవోయ్ గట్టి మేల్ తలపెట్టవోయ్...' అంటూ గురజాడ దేశభక్తి గేయాన్ని ఆలపిస్తూ ముందుకు సాగారు. మార్గం మధ్యలోని గురజాడ అప్పారావు విగ్రహానికి ఒక డీసెంట్ నోట్ సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత అట్టాడ అప్పలనాయుడు, ప్రజాకవి గంట్యాడ గౌరినాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ తదితరులు మాట్లాడుతూ గురజాడ అభ్యుదయ ఒక వాది అని, ఆయన దేశం, సమాజం ముందుకు వెళ్లడానికి దోహదపడే అనేక విషయాలు వందేళ్ల క్రితమే చెప్పారని గుర్తుచేశారు. అన్నదమ్ముల వలెను జాతులు మెలగవలెనోయ్.. మతములన్నియు మాసిపోవును, జ్ఞానం ఒక్కటే నిలిచి వెలుగును.. అంటూ కులమతాలను ఐక్యం చేసేందుకు ప్రయత్నించారని వివరించారు. స్త్రీ జాతికి జరుగుతున్న అన్యాయాలను గురజాడ తన రచనల ద్వారా ఎండగట్టారని తెలిపారు. గురజాడ, చాగంటి భావాల మధ్య ఎంతో వైరం ఉందన్నారు. గురజాడకు విరుద్ధ భావాలు ప్రచారం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ పురస్కారం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలా ప్రశ్నిస్తున్నవారిని హిందూ వ్యతిరేకులుగా చిత్రీకరించేందుకు, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు కొంతమంది ప్రయత్నించడం సరికాదన్నారు. మగవాడు స్నానం చేసేటప్పుడు కట్టుకున్న గోసిపాతను ఆడది ఉతికితే ఉన్నతమైన మోక్షం పొందుతుందంటూ చాగంటి కోటేశ్వరరావు నికృష్టమైన భావజాలం వెదజల్లారని అన్నారు. స్త్రీ జాతిని చాగంటి అణగదొక్కుతున్నారనడానికి ఇంతకన్నా ఉదాహరణలకు అక్కరలేదన్నారు. గురజాడ అభ్యుదయ భావాలను ముందుకు తీసుకెళ్లే వారికి ఈ పురస్కారం ఇవ్వాలన్నారు. ఎక్కడ అభ్యుదయం మౌనం వహిస్తుందో, అక్కడ ఛాందసవాదం, దుర్మార్గం, రుగ్మతలు రాజ్యమేలుతాయని చెప్పారు. అందువల్లే నేడు సాహితీవేత్తలంతా రోడ్డెక్కారని అన్నారు.



గురజాడ విగ్రహానికి అసమ్మతి పత్రం అందజేస్తున్న సాహితీవేత్తలు

ఈ కార్యక్రమంలో సాహితీస్రవంతి, అరసం, సహజ విశ్వసాహితి, స్నేహ కళా సాహితీ వెలుగు, రాజాం రచయితల సంఘం, ప్రజాసాహితీ, జన విజ్ఞాన వేదిక సభ్యులు, ఒంగోలు సాహితీవేత్త నార్ని వెంకటసుబ్బయ్య, ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్, మన్యాల బాలకృష్ణ చలం, ప్రజాగాయకుడు డప్పు శీను, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అనేకమంది కవులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

రాందేవ్‌బాబాను అరెస్ట్ చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి - కలెక్టరేట్

మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసినందుకు రాందేవ్ బాబాపై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.రాజకుమారి, రెడ్డి.శ్రీదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేసింది. మహిళ పట్ల, వారి వస్త్రాధారణ పట్ల విపరీత వ్యాఖ్యలు చేసి యావత్ మహిళా లోకాన్ని అవమానించిన రాందేవ్ బాబా బహిరంగంగా క్షమాపణ చెప్పడంతో పాటు ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల గరికపాటి నరసింహారావు స్త్రీల పట్ల అసభ్యకరంగా మాట్లాడారని వారి వ్యాఖ్యలు మరువక ముందే తాజాగా రాందేవ్ బాబా మహిళలను కించపరిచేలా మాట్లాడడం మహిళల ఆత్మగౌరవానికి భంగపాటని మండిపడ్డారు. బిజెపి పాలనలో దేశంలో పురుషాధిక్యతతో, స్త్రీలను చులకనగా చూసేవారు అనేకమంది ఉన్నారని, స్త్రీల వస్త్రధారణ చుట్టూ తిరుగుతూ వారు పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. బిజెపి సంఘ పరివార్ ముఖ్యమంత్రుల, నేతల సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఈ వ్యాఖ్యలు వెనుక బిజెపి నరేంద్ర మోడీ హస్తం ప్రధానంగా ఉందని స్పష్టంగా తెలుస్తుందని వాపోయారు. మహిళల పట్ల బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం రాందేవ్ బాబా వ్యాఖ్యలే నిదర్శనమని అన్నారు. ఈ వ్యాఖ్యలు మహిళల ఆత్మ గౌరవం దెబ్బతీస్తుందని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాందేవ్ బాబాపై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం మహిళల పట్ల ప్రదర్శిస్తున్న ఈ వ్యాఖ్యలను మహిళలంతా గమనించాలని, తీవ్రంగా ఖండించాలని కోరారు.

నేడు సున్నా వడ్డీ పంట రుణాల చెల్లింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్

రైతులకు సున్నా వడ్డీ పంట రుణాల చెల్లింపును సోమవారం చేపట్టనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రక్కన జారీ చేశారు. జిల్లాలో 35 వేల మంది రైతులకు రూ.6.11 కోట్లు సున్నా వడ్డీ పంట రుణాలు చెల్లింపు జరుగుతుందని, 887 మంది రైతులకు పెట్టుబడి సబ్సిడీగా రూ.39 లక్షలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బాక్సింగ్ ఛాంపియన్ విశాఖ

- రన్నర్‌గా విజయనగరం
- బెస్ట్ బాక్సర్‌గా అజయ్ వర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ఆరో సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో 13 కేటగిరీల్లో ఉత్తమ ప్రదర్శనతోపాటు అధికంగా మెడల్స్ సాధించిన విశాఖపట్నం ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. రన్నర్‌గా విజయనగరం బాక్సర్లు నిలిచారు. జిల్లాకు చెందిన ఎన్.అజయ్ వర్మకు బెస్ట్ బాక్సర్ అవార్డు లభించింది. విజేతలకు బాక్సింగ్‌లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మథ కుమార్, అసోసియేషన్ నాయకులు బహుమతులు అందించారు.



రన్నర్ ట్రోఫీని అందుకుంటున్న విజయనగరం జట్టు

కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు, జిల్లా, రాష్ట్ర నాయకులు, రిఫరీలు పాల్గొన్నారు.

రూ.70 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారం

'గడపగడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు సమస్యలన్నీ పరిష్కారమవుతాయని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చేయడానికి రూ.70కోట్లతో భారీ ప్రాజెక్ట్ నిర్మాణం కానుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో ఆదివారం గడపగడపకూ ప్రభుత్వంలో భాగంగా బంగారమ్మపేటలో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీ గత ఆరేళ్లుగా తాగునీటి సరఫరా లేదని, చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు రాజన్నదొర దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా తాగునీటి సరఫరాకు సమస్యలు లేకుండా కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. తొలుత అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఎస్‌టి పోస్టుమెట్రిక్ హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ నుంచి ప్రధాన రహదారికి మంజూరైన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గుమడాం జగనన్న లేఅవుట్ లో తనకు ఇంటి పట్టా ఇచ్చారని, కానీ స్థలం ఇవ్వలేదని సిహెచ్.రమణి రాజన్నదొర దృష్టికి తీసుకెళ్లారు. తన కుమారుడు వందశాతం వికలాంగుడని, ఏ పనీ చేయలేడని, రూ.5వేలు పింఛను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు సింగారపు ఈశ్వరరావు, గిరి రఘు, గొర్లి వెంకటరమణ పప్పల లక్ష్మణరావు రాపాక మాధవరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, శ్యామలాంబ కోపరేటివ్ స్టోర్స్ చైర్మన్ మేడిశెట్టి అప్పలనాయుడు, వైసిపి నాయకులు బంటు కన్నంనాయుడు, కమిషనర్ హెచ్ శంకరరావు, ఎఇ సూరి నాయుడు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాజన్నదొర

సీతానగరం : మండలంలోని తామరకంటి సచివాలయం పరిధిలో గల బొక్కుపేటలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ అర్హులైన పేదలకు పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు టి.బాబ్జీ, వైసిపి నాయకులు బి.శ్రీరాములునాయుడు, బి.చిట్టిరాజు, బి.తిరుపతిరావు, ఎన్.రామకృష్ణ, జి.అప్పారావు, బి.సూర్యనారాయణ, సర్పంచు బి.మంగమ్మ అధికారులు వైసిపి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.


29న విజయనగరంలో మంత్రి జోగి రమేష్ పర్యటన


విజయనగరం: ఈ నెల 29న గృహనిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో గృహ నిర్మాణ ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి తెలుసుకోవడంలో భాగంగా మంగళవారం జిల్లాకు వస్తున్నట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ ప్రగతిని క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు గుంకలాంలో జగనన్న కాలనీని సందర్శిస్తారు. 3.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన గృహనిర్మాణశాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ప్రజారోగ్య ఇంజినీరింగ్, విద్యుత్తు, గ్రామీణ నీటిసరఫరా తదితర శాఖల అధికారులతో సమీక్షించనున్నారు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- రూ.24.75 కోట్లు స్త్రీనిధి నిధులు మంజూరు
- ప్రతి నెలా రూ.34.53కోట్లు పింఛన్లు పంపిణీ
- 'ప్రజాశక్తి'తో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ ముఖాముఖి

జిల్లాలోని మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందే లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పనిచేస్తుందని ఆశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో స్త్రీనిధి రుణాలు ఈ ఏడాది రూ.24.75కోట్లు మంజూరు చేశామని చెప్పారు. అలాగే ప్రతినెలా మొదటి తేదీ నాటికి జిల్లాలోని లక్షా37,660 మంది పింఛను దారులకు రూ.34.53కోట్లు అందజేస్తున్నట్టు చెప్పారు. వీటితో పాటు తమశాఖ ఆధ్వర్యాన చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజాశక్తికి ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే... -ప్రజాశక్తి, కలెక్టరేట్





జిల్లాలో మొత్తం ఎంతమందికి పెన్షన్లు అందజేస్తున్నారు?

నవరత్నాలలో భాగంగా వైఎస్ఆర్ పెన్షన్ కానుక పథకంలో వృద్ధులకు, వితంతువులకు, చేనేత, కల్లుగీత కార్మికులకు, మత్స్యకారులకు, ఒంటరిమహిళలకు, చర్మకారులకు రూ.2,500 చొప్పున, హిజ్రాలకు, డప్పు కళాకారులకు, రంగస్థల కళాకారులకు, వికలాంగులకు రూ.3వేలు చొప్పున, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.10వేలు పింఛను అందజేస్తున్నాం. మొత్తంగా 1,37,660 మందికి నెలకు రూ.34.53 కోట్లు మొదటి తారీఖు నాటికి వాలంటీర్ల ద్వారా అందజేస్తున్నాం.

డిఆర్‌డిఎ ద్వారా అందిస్తున్న పథకాలేమిటి?

వైఎస్ఆర్ ఆసరా పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘ సభ్యులకు ఉన్న బ్యాంకు లింకేజీ రుణాల అప్పు నిల్వ రూ.129.97కోట్లు. ఈ సభ్యులకు నాలుగు విడతల్లో తిరిగి చెల్లించే హామీలో భాగంగా, ఇప్పటి వరకు (గత రెండు సంవత్సరాలలో) 6913 స్వయం సహాయక సంఘాల పరిధిలో గల 80692 మంది స్వయం సహాయక సంఘ మహిళలకు రూ.65.77కోట్లు చెల్లించాం. అలాగే వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా 45 నుంచి 60ఏళ్లలోపు మహిళలు వివిధ వ్యాపారాలు చేసుకొని ఆర్థికాభివృద్ధి పొందుటకు గానూ ఏడాదికి రూ.రూ.18,750 చొప్పున నాలుగేళ్లకు రూ.75వేలు ఆర్థిక సహాయం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడత 55,126 మంది మహిళలకు రూ.103.37 కోట్లు, రెండో విడత 57,838 మంది మహిళలకు రూ.108.44 కోట్లు, మూడో విడత 68,032 మంది మహిళలకు రూ.127.56 కోట్లు చెల్లించారు. మూడు విడతలు ఇప్పటివరకు రూ.338.37 కోట్లు విడుదల చేశాతం

జిల్లాలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి? స్వయం సహాయక సంఘాలకు అందించే బ్యాంకు రుణాలు వివరాలు చెప్పండి?

జిల్లాలోని 15 మండలాల్లో గల 2,26,692 మంది సభ్యులతో 19,628 స్వయం సహాయక సంఘాలు, 566 గ్రామైఖ్య సంఘాలు, 15 మండల సమాఖ్యలు, గిజన మహిళా సమాఖ్య ఉన్నాయి. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా2022-23 సంవత్సరము 1310 స్వయం సహాయక సంఘాలకు జీవనోపాదుల కల్పన మరియు ఆదాయ అభివద్ధికై రూ.52.10 కోట్ల బ్యాంకు రుణాలు మంజూరు చేశాం. వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకంలో భాగంగా గత మూడేళ్లకు గానూ 8445 స్వయం సహాయక సంఘాలకు ఉన్న అప్పుపై బ్యాంకు వారికి చెల్లించిన వడ్డీ రూ.11.25 కోట్లు ప్రభుత్వం 99,480 మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు చెల్లించాం.

స్త్రీనిధిలో ఎంతమంది లబ్ధిదారులు లబ్ధి పొందారు?

2022-23 సంవత్సరానికి గానూ స్వయం సహాయక సంఘ సభ్యులకు జీవనోపాధి కల్పన, ఆదాయ అభివృద్ధిలో భాగంగా ఇప్పటి వరకూ 4950 మంది స్వయం సహాయక సంఘ మహిళలకు రూ.24.75కోట్లు రుణాలు మంజూరు చేశాం.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి చేస్తున్న కృషి ఏమిటి?

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం గ్రామీణ అభివద్ధి సంస్థ ఉన్నతి పథకంలో 2013 నుంచి స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి సభ్యులకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుంది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5473 మంది ఎస్‌సి, ఎస్‌టి సభ్యులకు ఆదాయాభివృద్ధి జీవనోపాధుల కొరకు రూ.16.42కోట్లు లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని ఆమోదం పొందారు. ఇప్పటి వరకూ 600మంది స్వయం సహాయక సభ్యులకు రూ.5.70కోట్లు రుణాలు మంజూరయ్యాయి. రుణాల మంజూరులో 57శాతం సాధించాం.

గ్రామీణ ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసుకునే వారికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటి?

జిల్లాలో జగనన్న తోడు పథకంలో భాగంగా చిరు వ్యాపారులకు వ్యాపార అభివృద్ధిలో భాగంగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున 11,125 మందికి రూ.11.13కోట్లు రుణాలు మంజూరు చేశాం. ఇందులో భాగంగా తొలి విడత 2603 మందికి రూ.2.60కోట్లు, రెండో విడత 2834 మందికి రూ.2.83 కోట్లు, మూడో విడత 3868 మందికి రూ.3.87కోట్లు, నాలుగో విడత 1820మందికి లబ్ధిదారులకు రూ.1.82 కోట్లు రుణాలు మంజూరు చేశాం.

డిఆర్‌డిఎ ద్వారా రైతుల అభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాలు ఏమిటీ?

రైతు ఉత్పత్తి దారుల సంఘాల (ఎఫ్‌పిఒ) పధాన లక్ష్యం రైతులకు సాంకేతిక మద్దతు, పంటలకు విలువ జోడింపు, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం అందించడం ద్వారా రైతుల ఆదాయాన్ని కనీసం 50శాతం పెంచడం. రైతుల జీవనోపాధులు పెంపొందించేందుకు 2018 నుంచి ఇప్పటి వరకు 625 ఎఫ్‌పిజిలో గల 787 మంది రైతులకు రూ.2.80కోట్లు ఎపిగ్రిప్ నిధుల నుంచి రుణాలు అందజేశాం. వీటి రికవరీ శాతం 85గా ఉంది. ఇప్పటి వరకూ 8మండలాల్లో గల 8ఎఫ్‌పిఒల్లో గల 18,411 మంది రైతులతో 1701 ఎఫ్‌పిజి.లు ఏర్పాటు చేశాం. ఉద్యానశాఖ సమన్వయంతో రైతులకు 75శాతం రాయితీతో ఆరు ఎఫ్‌పిఒల్లో ఒక్కో కలెక్షన్ సెంటర్‌కు రూ.15లక్షలు చొప్పున రూ. 90లక్షలతో ఆరు కలెక్షన్ సెంటర్లు 2022-23లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేశాం.


సచివాలయ స్లాబ్ పనులను చేయిస్తున్న అధికారులు

ముమ్మరంగా సచివాలయ పనులు

సీతానగరం : మండలంలోని పెద్ద భోగిలి-2 సచివాలయం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సీతానగరం ఎంపిటిసి సభ్యులు బురిడి కుసుమ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ సంతోష్ ఈ పనులను పరిశీలన చేయగా స్లాబ్ పనులు పూర్తయ్యాయన్నారు. ఇప్పటికే పెదభోగిల సచివాలయం పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, రెండో సచివాలయం పనులు కూడా వేగవంతం చేసి త్వరలో అందుబాటులోకి రానున్నట్లు వారు తెలిపారు.


లక్ష్మునాయుడుకు నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

లక్ష్మునాయుడు కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

పాలకొండ : ఇటీవల మరణించిన విశ్రాంత ఉపాధ్యాయులు సీమల లక్ష్మునాయుడు కుటుంబాన్ని ఆదివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పరామర్శించారు. లక్ష్మునాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎమ్మెల్సీ వెంట ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసుదేవరావు, సంపత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బివి రమణ, జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, మునసల నాయుడు, గౌరీశ్వరరావు, కేడికె మోహన్, రామ్మోహన్, కె.వి. రమణమూర్తి, శివప్రసాద్, శశిరేఖ, ఉత్తర కుమారి, సన్యాసి నాయుడు, గడ్డియ్య, అనిత, ప్రతాప్ ఉన్నారు.


స్కై సైకిలింగ్ చక్కర్లు కొడుతున్న పర్యాటకులు

పార్కులో పర్యాటకులు సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడం, అందులో కార్తీక పూర్ణం మొదటి ఆదివారం రావడంతో జిల్లా నలుమూలల నించే కాకుండా ఇతర జిల్లాల నుంచీ పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. కమాండో నెట్టు ఎక్కి చిన్నారులు ఆడుకున్నారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. ఆదిత్య విహార్ వద్ద దానులు వేశారు. అల్లన్ వెహికల్ పార్కు చుట్టుముట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. పర్యాటకులతో మెయిన్ రోడ్ లో వాహనాలు బారులు తీరాయి.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ వాయిదా

కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ జిల్లా 30వ మహాసభలు డిసెంబరు 5, 6 తేదీలకు వాయిదా వేస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ ఒక ప్రకటనలో ద్వారా తెలిపారు. ఆదివారం జిల్లా కమిటీగా ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 26, 27 తేదీల్లో జరగాల్సిన జిల్లా మహాసభలను కొన్ని అనివార్య కారణాల రీత్యా వాయిదా వేస్తూ డిసెంబరు 5, 6 తేదీలకు వాయిదా వేశామన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, అభ్యుదయవాదులు, మేధావులు, ప్రజలు గమనించాలని కోరారు. డిసెంబర్ 5, 6 తేదీల్లో పార్వతీపురంలో జరుగు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

ఆటా కొత్త శాఖల ఏర్పాటు

సాలూరు : ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం నూతన శాఖల ఏర్పాటయ్యాయి. ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన కార్యక్రమంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పైడిరాజు అధ్యక్షతన రెండు మండలాల కొత్త కార్యవర్గాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుమ్మలక్ష్మీపురం మండల కమిటీ బిడ్డిక జగదీశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గౌడు నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా గేదెల సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా మూటక యోగేంద్ర, కోశాధికారిగా కిల్లక రవికుమార్, మీడియా ఇన్‌ఛార్జి మండంగి లవరాజు ఎన్నికయ్యారు. కురుపాం మండల కమిటీ గౌరవాధ్యక్షులుగా రవ్వల గౌరీశ్వర్, అధ్యక్షులుగా ఆరిక అరుణశ్రీ, ఉపాధ్యక్షులుగా ఆరిక శ్రీను, ప్రధానకార్యదర్శిగా మండంగి మాధవరావు, సహాయ కార్యదర్శిగా బిడ్డి అశోక్, కోశాధికారిగా బిడ్డిక రామకృష్ణ, మీడియా ఇన్‌ఛార్జిగా మండంగి లవరాజు ఎన్నికయ్యారు.

సకాలంలో ధాన్యం కొనాలి

గుమ్మలక్ష్మీపురం /జియమ్మ వలస : రైతు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయాలని కురుపాం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం పెదబుడ్డిడిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని లేకుంటే రైతులు దళారీల బారిన పడి నష్టపోతారన్నారు. గత ఏడాది ఆ విధంగా జరిగిందని ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు. ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయని ధాన్యం రైతులు సిద్ధం చేస్తున్నారని వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

గిరిజనులకు మరిన్ని సేవలు

సీతంపేట: గిరిజన జీవన విధానంలో పెను మార్పులు తీసుకొచ్చిన సంఘ సేవకులు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేయాలని నారీశక్తి అవార్డు గ్రహీత, టిడిపి నాయకులు పడాల భూదేవి అన్నారు. మండలంలోని కొండాడ పంచాయతీ మేడ వబ్బంగిలో జరిగిన సంఘ సేవకుల కూడికలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘ సేవకులు యస్ కాలేబో, సుదర్శన, బాప్తిసో, సోమయ్య భూదేవి సేవలను కొనియాడారు. ఆదివాసీ మహిళాగా రాష్ట్రపతి అవార్డు అందుకోవటం గిరిజనులంతా గర్వించదగ్గ విషయమన్నారు. మాజీ ఎంపిపి ఎస్.కుంపి, బాలరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన గ్రంథాలయాధికారి

పాలకొండ రూరల్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఇటీవల వేసవి శిక్షణా శిబిరంలో మట్టితో బొమ్మలు ఎలా తయారు చేయాలో తంపటాపల్లి పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయులు జి.మురళి నేర్పించారు. అయితే ఆయన శిక్షణలో నేర్చుకున్న స్థానిక పెదకాపువీధి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వడ్డాది లోహిత్ కాళికా దేవి విగ్రహాన్ని మట్టితో తయారు చేశాడు. ఈ విద్యార్థిని ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ అభినందించారు.


లోహిత్‌ను అభినందిస్తున్న గ్రంథాలయాధికారి గణేష్‌బాబు

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి మన్మధరావు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు గరుగుబిల్లి మండల మహాసభ నాగూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను పూర్తిగా రద్దుచేసి వారి హక్కులను హరించిందని విమర్శించారు. కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేయడం, జీత భత్యాలు అడిగే శక్తి లేకుండా చేయడం బిజెపి ప్రభుత్వ విధానమని అన్నారు. ఇలా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపికి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్ కార్మికులకు వేతన ఒప్పందం గడువు ముగిసినందున నూతన వేతన ఒప్పందం చేసేందుకు యాజమాన్యాలు పూనుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డివి నాయుడు కన్వీనర్‌గా సిఐటియు మండల నూతన కమిటీ ఎన్నికైంది. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు అచ్చియమ్మ, మీనాక్షి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సంగీత, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు బి.సూర్యం, రైస్ మిల్ కళాసీ యూనియన్ నాయకులు చంద్రయ్య, ఎం.ప్రసాద్, జి.గౌరి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: రాష్ట్రం లోని కార్మికుల హక్కులపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయని సిఐటియు జిల్లా మాజీ కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సిఐటియు మండల మహాసభ టి.రాముడు అధ్యక్షతన జరిగింది. తొలుత ఎ.నారాయణమ్మ సిఐటియు జెండాను ఎగురవేశారు. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ కార్మికుల చట్టాలను నిర్వీర్యం చేసే దిశగా జగన్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి కార్మికుడికి రూ.26వేలు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాల్సిన అవసరం వుందని చెప్పారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్వై నాయుడు మాట్లాడుతూ అంగన్వాడీ, మున్సిపల్, ఆర్పీల సమస్యల పరిష్కారంలో సిఐటియు ముందుండి సాధించిందని చెప్పారు. భవిష్యత్ లో అన్ని సంఘాలు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.రాధ, హెల్పర్స్ యూనియన్ నాయకులు నిర్మల, గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ నాయకులు రామారావు, సుజాత, ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆర్.రాము, సిహెచ్ డబ్ల్యు సంఘం నాయకులు రమణమ్మ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు సుశీల, రేవతి,ఆర్పీ ల సంఘం నాయకులు పార్వతి,ప్రభ, అన్నపూర్ణ పాల్గొన్నారు.


సాలూరు : మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు రెడ్డి వేణు


గరుగుబిల్లి : మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావు

వీరఘట్టం : సిఐటియు మండల మహాసభలు డిసెంబర్ స్థానిక కోదండరామ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి దావాల రమణారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాల పుణ్యమా అన్ని జిల్లాలో షుగర్ ఫ్యాక్టరీలు, జూట్ మిల్లులు, చిన్నాచితక పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. ఫలితంగా 20వేల మందికి ఉపాధి పోయిందని, వీటికి తోడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన ఇసుక విధానంతో పాటు నిర్మాణ రంగానికి అవసరమైన ధరలు విపరీతంగా పెరగడంతో జిల్లాలో గత మూడేళ్లుగా 50వేల మంది భవన నిర్మాణ కార్మికులకు పని లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారని ఆయన అన్నారు. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, వెలుగు, తదితరు స్కీం వర్కర్లతో ప్రభుత్వం గొడ్డిచాకిరీ చేయించుకుంటున్నా కార్మికులుగా మాత్రం గుర్తించడం లేదని, స్కీం వర్కర్లకు, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా కట్టుబానిసలుగా చేస్తున్నారని అన్నారు. కార్మిక వర్గ విముక్తి ఐక్య పోరాటమే శరణ్యమని ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీ ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా సిహెచ్ భాగ్యలక్ష్మి, ఎన్.ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు స్వర్ణలత, కె.హైమావతి, యు.గౌరమ్మ, ఎల్.దేవమణి, ఆర్.భవాని, వి.వెంకటమ్మ, పి.ప్రసాదు, వై.ప్రసాదు, బి.వాసుదేవరావు, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


దేరువాడలో సంత షెడ్‌లో విద్యార్థులకు తరగతులు

సంత షెడ్డులో తరగతులు

52 మందికి ఒక్కరే ఉపాధ్యాయులు

వరండాలో చదువులతో విద్యార్థులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులకు సంత షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులకు చదువు ఇబ్బందిగా మారింది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని లోవ ముఠా ప్రాంతమైన దేరువాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులకు తాత్కాలికంగా గ్రామంలో ఉన్న సంత షెడ్ వరండాలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కూర్చోవడానికి కష్టంగా మారింది. ఎండ ప్రభావం కూడా విద్యార్థులపై పడడంతో ఇబ్బందిగా మారింది. ఒకటి నుంచి 5వ తరగతి వరకు 52 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఐదు తరగతులకు ఒక్కరే ఉపాధ్యాయులు ఉండటం గమనార్హం. ఎల్ఎఫ్ఎల్ పోస్ట్ ఖాళీగా ఉందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం గ్రామంలో వంట చేసి తీసుకువచ్చి పెడుతున్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్ట్ భర్తీ చేసి, త్వరితగతిన భవనం పనులు పూర్తి చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాడు నేడు లో భవనం మంజూరు

దేరువాడ ప్రాథమిక పాఠశాలకు పక్కా భవనం నిర్మాణం కోసం రెండో విడత నాడు నేడు లో రూ. 42 లక్షలు మంజూరైనట్లు ఎంఇఒ నారాయణస్వామి తెలిపారు. గ్రామంలో పాఠశాల భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

జెజెఎం ద్వారా తాగునీరు అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

రానున్న వేసవిలో జెజెం (జనజీవన్‌మిషన్) ద్వారా ఏర్పాటు చేసిన పైపులను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి ప్రజలకు తాగునీరందించాలని సిఐటియు, గిరిజన, వ్యవసాయ కార్మికసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటర్ వద్ద గిరిజన సంఘ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కె.సాంబమూర్తి, హెచ్.లక్ష్మం, నూకరాజు, రెడ్డి శివున్నాయుడు మాట్లాడుతూ జెజెఎం ద్వారా మండలంలో చినఖేర్జల పంచాయితీ బట్టి మానవలసలో గిరిజన కుటుంబాలకు గానూ ప్రతి ఇంటికీ కొళాయి ఇచ్చినప్పటికీ ఏడాదైనా చుక్క నీరు కూడా రాకపోవడం అన్యాయమన్నారు. ఇదే పంచాయతీలో సీసాడవలసలో కూడా 40 కుటుంబాలకు గానూ 10కుటుంబాలకే తాగునీరందుతుందని, మిగితా వారికి నీరందడంలేదని అన్నారు. అలాగే కూనేరులో సగం మందికే తాగునీరందుతుందన్నారు. కొమరాడ మండల కేంద్రంలో పాత బీసీ కాలనీకి ప్రతి కుటుంబానికి పైప్ లైన్ ఇస్తామని చెప్పి ఐదు నెలలైనా ఇంకా పైపులు బిగించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని గిరిజన గ్రామాలకు తాగునీరందించి రానున్న వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆదుకోవాలని కోరారు. నిరసనలో రాము, లక్ష్మణరావు, మంగమ్మ, పార్వతి, సోములు, వెంకట్రావు, భీమారావు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గిరిజన హక్కులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

భారత రాజ్యాంగం కల్పించిన ఆదివాసీ గిరిజనులకు సంబంధించిన హక్కులపై ప్రతి ఆదివాసీ గిరిజనుడు తెలుసుకోవాలని, వాటిని కాపాడుకోవాలని అఖిల భారత ఆదివాసీ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనక సింహాచలం అన్నారు. మండలంలోని దత్తివలస వద్ద అఖిల భారత ఆదివాసీ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న సింహాచలం మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు సాధించుకోవాలని, జీవో 52ను రద్దు చేయాలని, గిరిజనులకు పోడు పట్టాలు వెంటనే ఇప్పించాలని, గిరిజన భూములను ఆక్రమించిన పెత్తందారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో గ్రానైట్, క్వారీలను ఎడాపెడా ప్రభుత్వం మంజూరు చేస్తుందని, స్థానిక సర్పంచులకు తెలియకుండా గ్రామ సభలు నిర్వహించకుండా అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గిరిజన యూనివర్శిటీని గిరిజన ప్రాంతాల్లోనే నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిచో అన్ని గిరిజన సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

సమావేశంలో ఆదివాసీ వికాస్ పరిషత్ జిల్లా అధ్యక్షులు పువ్వల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సంగంరెడ్డి జయసింహ, మహిళా నాయకులు మంచాల పారమ్మ, మండల అధ్యక్షులు మజ్జి నారాయణరావు, గిరిజన నాయకులు పరమేష్, భీమారావు, గిరిజనులు పాల్గొన్నారు.


చేపల వ్యర్థాలతో పంటకు ఎంతో మేలు

ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ ట్రైనింగ్ ఆఫీసర్ హేమ సుందర్

ప్రజాశక్తి - పాచిపెంట

వృథాగా పారవేసిన చేపల వ్యర్థాలతో ఎంతో బలవర్ధకమైన పంటలకు అందించే పోషకాన్ని తయారు చేయవచ్చని ప్రకృతి వ్యవసాయ రీజనల్ ట్రైనింగ్ ఆఫీసర్ హేమ సుందర్ అన్నారు. మండలంలోని కేసలిలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను ఆదివారం పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులంతా అతి తక్కువ ఖర్చుతో పంటలకు ఉపయోగపడే పోషకాలను చేపల వ్యర్థాలతో తయారు చేసుకోవచ్చన్నారు. 10 కేజీల చేపల వ్యర్థాలను సమీకరించి దానికి రెండు, మూడు కేజీల బెల్లం కలిపి ప్రతి రోజు ఉదయం సాయంత్రం కలుపుతూ పది రోజుల తర్వాత ఐదు లీటర్ల మాత్రంలో కలుపుకుని వడగట్టి లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల ద్రావణాన్ని కలిపి పిచికారీ చేసుకుంటే పంటలు ఎంతో ఆరోగ్యవంతంగా ఎదుగుతాయని అన్నారు. మార్కెట్లో దొరికే రసాయన ఎక్కువ ఖరీదు ఉంటాయని, కేవలం వంద రూపాయల ఖర్చుతో తమ ఇంటి వద్ద రైతులు తయారు చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం పత్తి పంట ఫిబ్రవరి వరకు కొనసాగించే రైతులకు ఇది ఎంతో మేలైందని తెలిపారు. అలాగే ఒకసారి పుల్లటి మజ్జిగ పిచికారి చేసి అనంతరం మీనామృతాన్ని పిచికారీ చేస్తే పూత, కాయ బాగా వస్తుందని తెలిపారు. దీనివల్ల అతి తక్కువ ఖర్చుతో బలవర్ధకమైన పోషకాలను తయారు చేయడమే కాకుండా పర్యావరణాన్ని కూడా కాపాడవచ్చని తెలిపారు. అనంతరం పొగాకు పంటలో పిచికారికి జిల్లేడు కషాయాన్ని రైతులతో తయారు చేయించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు మెట్టారయిజం ద్రావణాన్ని, రసం పిలిచి పురుగుల నివారణకు బవేరియా ద్రావణాన్ని పంటపై పిచికారి చేయించారు. అనంతరం రబీ సీజన్లో మొక్కజొన్నలో అంతర పంటలు వినూత్నమైన గులి రాగి పద్ధతిపై రైతులు అవగాహన కల్పించాలని ప్రకతి వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఒ కె.తిరుపతి రావు, ప్రకృతి సేద్య సిబ్బంది సురేష్, విజయ్, మోహనరావు, రైతులు పాల్గొన్నారు.


వివిధ కషాయాలను తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి హేమసుందర్


ఆందోళనలో ప్రేమ్‌చంద్ కుటుంబీకులు

ఇద్దరు అదృశ్యం

నేటికీ దొరకని ఆచూకీ

లబోదిబోమంటున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - జియమ్మవలస/ గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పెదబుడ్డిడలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమై కొద్ది రోజులు గడుస్తున్నా నేటికీ వారి ఆచూకీ దొరకకపోవడంతో కుటుం సభ్యులు లబోదిబోమంటున్నారు. పెదబుడ్డిడికి చెందిన కంటుమంతి ప్రేమ్ చందు (14) అక్టోబర్ 16న సైకిల్ బాగు చేస్తానని చెప్పి తన తల్లి నుంచి రూ.100 తీసుకొని ఇంటి నుండి వెళ్ళాడు. ఆ రోజున వెళ్ళిన తన కుమారుడు ఇంతవరకూ ఇంటికి తిరిగి రాలేదని తల్లిదండ్రులు శ్రీను, ధనలక్ష్మి ఆవేదన చెందుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో, పరిసర ప్రాంతాల్లో, కుటుంబ సభ్యులు, బంధువుల ఇంటి వద్ద చూసినప్పటికీ ఇంతవరకు కనబడడం లేదని తెలిపారు. ఇదే విషయమై జియమ్మవలస పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. శ్రీను, ధనలక్ష్మి దంపతులకు బాబు, ఒక పాప ఉన్నారు. ఒకే ఒక్క కుమారుడు ప్రేమచందు కనబడకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన రేవళ్ల సీతారాం గత ఆగస్టు నుంచి కనబడడం లేదని మాజీ సర్పంచ్ గురాన శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కొద్ది నెలలుగా ఇలా పెదబుడ్డిడి వ్యక్తులు అదృశ్యం అవుతుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. స్థానిక పోలీసు అధికారులు ఈ విషయమై స్పందించి అదృశ్యమైన వ్యక్తులు ఆచూకీ తెలుసుకోవడానికి ప్రయత్నించాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఇసుక తవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెద బోగిలి పంచాయతీ పరిధిలో గల బుడ్డిపేటలో స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ తవ్వకాల వల్ల తమ గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం లేకుండాపోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని కోరారు.

మర్రిచెట్టు తొలగింపు

పాలకొండ: రెండు నెలల క్రితం వెంకటరాయుని కోనేరు గట్టుపై నేలకొరిగిన మర్రి చెట్టును ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు ఆదివారం తొలగింపు పనులు చేపట్టారు. ఇటీవల పత్రికల్లో వరుస కథనాలు వచ్చిన నేపథ్యంలోనూ, గ్రీవెన్స్‌లో అందించిన ఫిర్యాదుల మేరకు నగర పంచాయతీ అధికారులు స్పందించి చెట్టును తొలగిస్తున్నారు. దీంతో ప్రజలకు ఆటంకం తీరనుంది.

గురువులకు సన్మానం

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో 1977 నుండి 1982 వరకు ఆరు నుంచి పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక గిరిజన సామాజిక భవనం వద్ద పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, పుప్పాల సుధాకర్ ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో 1982లో పదో తరగతి చదువుకున్న దాదాపు 50మందికి పైగా పూర్వ విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, అంతా ఆప్యాయంగా పలకరించు కుంటూ తమ చిన్నప్పటి చదువుకున్న రోజులను, ఆనాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పలస్వామి, గుణుపూరు సింహాచలం, శ్రీరామ మూర్తి మాస్టార్లను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి, జ్ఞాపకలను బహకరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ముదిలి రామకృష్ణ, ఎ.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.


గురువును సన్మానించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలిక

నవదుర్గ ఆలయంలో అన్నదానం


పార్వతీపురంటౌన్: పట్టణంలో కొత్తవలస నవదుర్గ ఆలయంలో పట్టణం కొత్తవలస శివారులో ఉన్న నవ దుర్గాదేవి ఆలయంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్యఅతిథిగా పాల్గొని వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

మూగజీవాలకు లంప్‌స్కిన్ ముప్పు

ప్రజాశక్తి -భామిని

రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా పశువులను మృత్యువాతకు గురి చేస్తున్న వ్యాధి లంప్‌స్కిన్. ఇది పశువులుకు వచ్చే వైరస్ వ్యాధి. ప్రస్తుతం మండలంలోని బురుజోల, లివిరి, పెద్దదిమిలి, బాలేరు, బత్తిలి, భామినిలో పశువులు ఈ వ్యాధి బారిన పడ్డాయి. సాధారణంగా ఈ వ్యాధి ఈగలు, రక్తం పీల్చే దోమలు, పేలు ద్వారా ఒక పశువు నుంచి మరో పశువుకి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి కేవలం ఆవులు, ఎద్దులు, దూడలకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకినా పశువుల చర్మంపై పెద్ద బొబ్బలు ఏర్పడి, జ్వరంతో నీరశించి, ఆహారం తీసుకోలేక, క్రమంగా మృత్యువాత పడుతున్నాయి.

ఈ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానిక పశువైద్యాధికారి గౌతమ్ ప్రసాద్ వివరించారు. లంప్ స్కిన్ ఒక రకమైన బొబ్బర్లు వ్యాధి అని, ఇది కాప్రి ఫాక్స్ అనే వైరస్ వల్ల వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి వ్యాప్తి నివారణకు ముందస్తుగా మండలంలోని 8 మంది సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్లు, నలుగురు గోపాల మిత్రలతో ప్రతి గ్రామంలో పశువులకు గోట్ ఫాక్స్ వాక్సిన్ వేస్తున్నామని తెలిపారు. ఈ వ్యాధికి పూర్తి స్థాయిలో వాక్సిన్ అందుబాటులోకి రాలేదని, వ్యాధి లక్షణాలు వస్తే ఆంటీ బయోటిక్లు వేస్తున్నామని, పాడి రైతులు పశువులు చర్మంపై బొబ్బర్లు పోలిన బొడపేలు కనిపిస్తే వెంటనే స్థానిక వెటర్నరీ అసిస్టెంట్‌కు తెలపాలని సూచించారు. ఈ వ్యాధి సోకిన పశువులను, ఇతర పశువులకు దూరంగా ఉంచాలని తెలిపారు. ప్రస్తుతం మండలంలో కృత్రిమ గర్భధారణ ద్వారా 10 పుంగనూరు దూడలు అందుబాటులో రైతులు వద్ద ఉన్నాయని, ఇవి 2.5 అడుగులు ఎత్తు వుంది, ఇంటి వద్ద, అపార్ట్మెంట్‌లో పెంపకానికి అనువుగా ఉంటాయని తెలిపారు. కొద్ది మొత్తం ఆహారంతో మంచి పాలను ఇస్తాయని తెలిపారు.


వ్యాధి సోకిన ఆవు